


చెల్లింపులు ఎలా..

ఉక్కు యాజమాన్యం తీరుతో స్టీల్‌ప్లాంట్ ఈపీఎఫ్ ట్రస్ట్ సంకట స్థితిలోకి వెళ్లింది. ఉద్యోగుల వేతనాల నుంచి నెలనెలా కట్ చేస్తున్న సొమ్ముతో పాటు యాజమాన్యం వాటా కూడా కొద్ది నెలలుగా చెల్లించడం లేదు. దీంతో ఉక్కు ఈపీఎఫ్ ట్రస్ట్‌కు యాజమాన్యం రూ.600 కోట్ల బకాయి పడింది. ఉక్కు ఈపీఎఫ్ ట్రస్ట్ ఆ మొత్తం ఈపీఎఫ్‌వోకు చెల్లించకపోతే ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న హయ్యర్ పెన్షన్ కోల్పోతారు. మరో వైపు యాజమాన్యం ప్రవేశపెట్టిన వీఆర్ఎస్‌లో చేరితే అన్ని సదుపాయాలు ఒకేసారి పొందవచ్చునని చాలా మంది ఉద్యోగులు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత పరిస్థితి వారిలో కూడా అలజడి రేపుతోంది.



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ ప్రావిడెండ్ ఫండ్ (ఈపీఎఫ్) ట్రస్ట్ ఉక్కపోతకు గురవుతోంది. యాజమాన్యం నుంచి ట్రస్ట్‌కు నిధులు జమ కాకపోవడంతో చెల్లింపుల భారం దించుకోవడానికి తర్జన భర్జన పడుతోంది. నిధులు ఎలా రాబట్టాలో కసరత్తు చేస్తోంది. స్టీల్‌ప్లాంట్‌లో వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) కొనసాగుతోంది. మార్చి నెలాఖరుకు వీఆర్ఎస్ ప్రక్రియ ముగుస్తుంది.మరో వైపు ఈపీఎఫ్‌వో నుంచి హయ్యర్ పెన్షన్ డిమాండ్ లెటర్లు జారీ అవుతున్నాయి. వీఆర్ఎస్ ఉద్యోగులకు పీఎఫ్ సెటిల్‌మెంట్ చేయాల్సి ఉండగా.. ఏప్రిల్ నెలాఖరుకు హయ్యర్ పెన్షన్‌కు ఉద్యోగుల పీఎఫ్ ఖాతా నుంచి నిధులు ఈపీఎఫ్‌వోకు పంపాల్సి ఉంది.

వీఆర్ఎస్‌కు చెల్లింపులు..

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన వీఆర్ఎస్‌కు స్పందించి సుమారు 1613 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో సుమారు 1100 మంది వీఆర్ఎస్‌కు ఆమోదం లభించింది. మార్చి నెలాఖరుతో నోటీసు పీరియడ్ పూర్తవుతుంది. వారికి పీఎఫ్ సొమ్ము చెల్లించాల్సి ఉంది. ఇలా సుమారు రూ.700 కోట్లు సెటిల్ చేయాల్సి ఉంటుంది.

హయ్యర్ పెన్షన్‌కు నగదు మార్పిడి

మరోవైపు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న హయ్యర్ పెన్షన్ కోసం ఈపీఎఫ్‌వో ఈ నెలలోనే సుమారు 6 వేల మందికి డిమాండ్ లెటర్లు జారీ చేసింది. వాటి నిమిత్తం ఏప్రిల్ 30లోగా ఉద్యోగుల పీఎఫ్ నుంచి రూ.900 కోట్లు ఈపీఎఫ్‌వోకు చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తం ఏప్రిల్ నెలాఖరులోగా ఈపీఎఫ్‌వోకు చెల్లించకపోతే ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న హయ్యర్ పెన్షన్ పొందే అవకాశం కోల్పోతారు.

ప్రస్తుతం పీఎఫ్ ట్రస్ట్ పరిస్థితి ఇలా...

గతేడాదిగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం 2024 ఫిబ్రవరి నుంచి పీఎఫ్ చెల్లింపులను పీఎఫ్ ట్రస్ట్‌కు నిలిపేసింది. దీంతో సుమారు రూ. 600 కోట్లు ట్రస్ట్‌కు బకాయి పడింది. ఈ అంశంపై రీజనల్ పీఎఫ్ కమిషనర్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి మూడు, నాలుగు సమన్లు కూడా జారీ చేశారు. అయినా ఇంత వరకు ట్రస్ట్‌కు చెల్లింపులు చేయలేదు. దాని వల్ల ఉక్కు పీఎఫ్ ట్రస్ట్ ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఎఫ్ నాన్ రిటర్నబుల్ రుణాలు కూడా నిలిపివేసింది. అదే విధంగా ఉద్యోగి పదవీ విరమణకు 11 నెలల ముందు ఇచ్చే 90 శాతం పీఎఫ్ చెల్లింపులు కూడా ఆపివేశారు.

పీఎఫ్ ట్రస్టు కింకర్తవ్యం ఏంటి?

పీఎఫ్ ట్రస్ట్ నిధులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, బాండ్లు, స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో పీఎఫ్ ట్రస్ట్ వద్ద వీఆర్ఎస్, హయ్యర్ పెన్షన్లు చెల్లించడానికి అవసరమైన నగదు లేదు. నిధుల సేకరణకు తమ డిపాజిట్లను అన్‌ఫ్రీజ్ చేయాల్సి ఉంది. దీనికి రీజనల్ ప్రావిడెండ్ కమిషనర్ అనుమతి ఇవ్వాలి. రూ. 600 కోట్ల బకాయిలపై ఉక్కు యాజమాన్యానికి సమన్లు జారీ చేసినా.. అనుమతిస్తారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులను వివరిస్తూ పీఎఫ్ సొమ్ము చెల్లించాలని ఇప్పటికే పీఎఫ్ ట్రస్ట్ ప్రతినిధులు యాజమాన్యానికి లేఖ రాశారు.

ఆశ ఫలించేనా..

వీఆర్ఎస్ తీసుకుంటే పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఒకేసారి సెటిల్ అవుతాయన్న భావనతో అనేక మంది ఉద్యోగులు దరఖాస్తు చేశారు. ఇప్పటి వరకు ప్రతీ నెలా 100 నుంచి 120 మంది వరకూ రిటైర్ అయినప్పుడు తర్వాత నెల 20 లోగా పీఎఫ్ సెటిల్ చేసేవారు. ఇప్పుడు ఒకేసారి 1100 మంది రిటైర్ అవుతున్న నేపథ్యంలో పీఎఫ్ చెల్లింపుల్లో జాప్యం జరిగే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వీఆర్ఎస్ సెటిల్‌మెంట్, హయ్యర్ పెన్షన్ చెల్లింపులపై ఉక్కు యాజమాన్యం ఏవిధంగా సహకారం అందిస్తుందోనని ఉద్యోగులు ఆందోళనగా ఎదురు చూస్తున్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా శాకాహార సద్భావన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ మాస్టర్లు

గాజువాక: పత్రీజీ పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాకాహార సద్భావన ర్యాలీని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. సాయికృప పిరమిడ్ ధ్యాన కేంద్రం నేతృత్వంలో గాజువాక హైస్కూల్ రోడ్, పంతులుగారి మేడ ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీలో ప్రతి ఒక్కరూ శాకాహారులుగా మారాలని నినాదాలు చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చిన్నమ్మలు, శివ గణేశ్వరరావు, జగదీశ్వరి, జయలక్ష్మి, మూర్తి, బాలాజీ, శైలజ, సుబ్బారావు, లత, అప్పలరాజు, పద్మ, కళావతి, విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు దుప్పట్ల వితరణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐఎస్ఎఫ్ మాజీ ఉద్యోగులు

గాజువాక: సీఐఎస్ఎఫ్ మాజీ ఉద్యోగులు గాజువాకలో పలువురు పేద పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సీఐఎస్ఎఫ్ మాజీ ఉద్యోగులు ఆదివారం ఇక్కడ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పేద పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం కార్యదర్శి రవిబాబు, సీఐఎస్ఎఫ్ మాజీ ఉద్యోగులు కొయిలాడ శ్రీనివాసరావు, సఫిల్లా, జి.ఈశ్వర రెడ్డి, అనపర్తి అప్పారావు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఉక్కు సమస్యలపై వినతి



కేంద్ర ఉక్కు సహాయమంత్రి వర్మకు బొకే అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దృష్టికి స్టీల్‌ప్లాంట్ సమస్యలను తీసుకెళ్లారు. ఆదివారం విశాఖ వచ్చిన మంత్రి వర్మను స్టీల్ బీఎంఎస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పెండింగ్ వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో స్టీల్ బీఎంఎస్ ప్రధానకార్యదర్శి జెర్రిపోతుల రమణ, స్టీల్ బీఎంఎస్ ఫెడరేషన్ అధ్యక్షులు కొమ్మినేని శ్రీనివాసరావు ఉన్నారు.

తిరుమలనగర్‌లో స్వచ్ఛతా హీ సేవ



అమరావతి పార్కును శుభ్రపరుస్తున్న తిరుమలనగర్ వాసులు

కూర్మన్నపాలెం: స్థానిక తిరుమలనగర్‌లోని అమరావతి పార్కులో కాలనీ వాసులు ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కును శుభ్రం చేసి ముళ్లపొదలను తొలగించారు. వాకింగ్ ట్రాక్, సెటిల్ కోర్టు తదితర ప్రాంతాలను శుభ్రపరచారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సంచులు వాడవద్దు అని.. గుడ్డ సంచులను వినియోగించాలని నినాదాలు చేశారు. తిరుమల నగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణ్, విశ్వేశ్వరరావు, శ్రీరాములు, ఉదయ్‌శంకర్, శివ,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవలోని శ్రీకంచి శక్తి పీఠం, స్వయంభూ శనేశ్వర పుణ్యక్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలకు విశేష ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఐదడుగుల స్ఫటిక లింగేశ్వరస్వామికి సహస్ర కలశాభిషేకం జరిపించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని నిర్వాహకులు కోరారు.

పెంటయ్యరెడ్డికి ఘన నివాళి



పెంటయ్యరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తిప్పల నాగిరెడ్డి, వంశీరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: సమాజ సేవకుడు గొందేశి పెంటయ్యరెడ్డి అని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య కొనియాడారు. పెంటయ్యరెడ్డి సంస్మరణ సభను నెల్లిముక్కులో ఆదివారం గొందేశి సుమన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, రాజాన రామారావు, దల్లి గోవింద్, నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్,పల్లా చినతల్లి, గొందేశి మహేశ్వరరెడ్డి, పులి రమణారెడ్డి, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక: పట్టణ ప్రాంతాల్లో నివాసముంటున్న పేదలందరికీ ప్రభుత్వం రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. 72వ వార్డు చైతన్యనగర్‌లోని పేదల నుంచి ఆ పార్టీ నాయకులు విష్ణుమూర్తి, ఆనంద్ ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల నుంచి సేకరిస్తున్న దరఖాస్తులను అధికారులకు అందజేస్తామని తెలిపారు.

వెండి కలశ బిందె అందజేత



తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వెండి కలశ బిందెను అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి అభిషేకంలో ఉపయోగించే వెండి కలశ బిందెను ఆదివారం షీలానగర్ వేంకటేశ్వరకాలనీకు చెందిన చరితేష్ వెంకట్, శ్రీ తారక్‌ల చేతుల మీదుగా దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ట్రస్ట్ ప్రతినిధులు స్వామి దర్శనం కల్పించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



దేవన్‌రెడ్డిని సత్కరిస్తున్న బీసీసెల్ నాయకులు వెంకటరమణ తదితరులు



మార్టుపూడి పరదేశిని అభినందిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: గాజువాక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీసెల్ అధ్యక్షుడిగా నియమితులైన చిత్రాడ వెంకటరమణ ఆదివారం ఆ పార్టీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. దేవన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేలా ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. నాయకులు బొడ్డగోవింద్, బి.సి.సెల్ నాయకులు తెన్నేటి రమణ, ఎల్.ఐ.సి నాయుడు, చిత్రాడ రాజు, తిలక్,హరీష్, వర్మ,సీతారామరాజు, నాగరాజు, సన్యాసిరావు పాల్గొన్నారు.

దేవన్‌రెడ్డిని కలిసిన పరదేశి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన మార్టుపూడి పరదేశి ఆదివారం వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.

కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, మాటూరి శ్రీనివాసరావు, గంట్యాడ గోవిందరాజు, రోజారాణి, కొయ్య భారతి, మంగరాజు, శ్యామ్ బాబు, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, నూకరాజు, అండిబోయిన అప్పారావు, రాములు, ప్రకాశ్, గొందేశి వెంకటరమణారెడ్డి, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక



అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ 1990-91 బ్యాచ్ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1990–91 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా సాగింది. జగ్గయ్యపాలెంలోని దుర్గాదేవి ఆలయంలో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఆత్మీయత.. అనురాగాలు పంచుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా సహచర విద్యార్థి అయిన కంపర శ్రీనివాసరావు ఇండియన్ ఆర్మీలో 30 ఏళ్లు సర్వీసు పూర్తి చేసుకుని పదవీవిరమణ పొందిన సందర్భంగా ఆలయ ధర్మకర్త కాండ్రేగుల జగ్గారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొండా శంకర్రావు, పడాల అప్పలరాజు, కాదా చినతల్లి, బి.భవాని, దుల్లా రాము, కోసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆధ్యాత్మిక జ్ఞాన కలశ యాత్ర

గాజువాక: గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ఈ నెల 27న చేపట్టనున్న 108 కుండీల గాయత్రి మహాయజ్ఞంను పురస్కరించుకొని ఆదివారం ఆధ్యాత్మిక జ్ఞాన కలశ యాత్రను ఘనంగా నిర్వహించారు. పాతగాజువాకలోని కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ప్రారంభమైన యాత్ర శ్రీనగర్‌లోని గాయత్రీ చేతన కేంద్రం వరకు కొనసాగింది. మహిళలు భారీ సంఖ్యలో తరలి వచ్చి కలశాలతో యాత్రగా ముందుకు సాగారు.



కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు

ఈ సందర్భంగా గాయత్రీ పరివార్ మేనేజింగ్ ట్రస్టీ ధన్‌జీ భాయ్‌పటేల్ మాట్లాడుతూ నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించేందుకు కలశ యాత్ర చేపట్టామన్నారు. 27న స్థానిక శ్రీనగర్ దరి శ్రీరామ్‌నగర్ వద్ద గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించనున్నామని, ఆరోజు ఉదయం ఏడు గంటల నుంచి డాక్టర్ చిన్మయ పెండ్యా చేతుల మీదుగా ప్రాణ ప్రతిష్ఠ, అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు అవతారం రాజు, జగదీష్, ఆశోపా, పర్వీన్ భాయ్ పటేల్, రూపవేణి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటా



కొలిపాక అప్పారావును సత్కరిస్తున్న చేనేత సంఘాల నాయకులు

అగనంపూడి: చేనేత కార్మికులు, కుటుంబాలకు తన పరిధిలో సహాయ సహకారాలు అందిస్తానని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు కొలిపాక అప్పారావు అన్నారు. అప్పారావు చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా పెదమడకలో ఆయన్ను ఆదివారం చేనేత సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పుట్టా శ్రీనివాసరావు, స్వర్ణపూడి ఈశ్వరరావు, మొండి సత్యనారాయణ, దొడ్డి దేముడు, గంధోళి పైడికొండ, బేతా ప్రసాద్, పొన్నగంటి నాగేశ్వరరావు, బొమ్మన రామూర్తి, దూడక రమేష్, పిల్లి శంకరరావు, గోవిందరావు, గంధోళి రామారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థికి ఆర్థిక సాయం

అక్కిరెడ్డిపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న తలారి సాయి మహర్షికి 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ ఆర్థిక సాయం చేశారు. సాయి మహర్షి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఉందని తెలుసుకుని ఆదివారం వారి ప్రతినిధితో రూ.15వేల నగదు అందించారు. తమకు సహాయ సహకారాలు అందజేస్తున్న కార్పొరేటర్ దంపతులకు విద్యార్థి తలారి శంకర్రావు కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



కర్రి ప్రవీణ్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: కటుంబ కలహాలతో జీవితం మీద విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాజువాక సీఐ పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన కర్రి ప్రవీణ్ (27) భార్య ప్రభతో కలిసి ఉంటున్నాడు. వీరికి దేవాంత్ (2), పృథ్వీ (4) పిల్లలు ఉన్నారు. ప్రవీణ్ ఓ పండ్ల వ్యాపారి వద్ద సహాయకుడిగా పనిచేస్తున్నాడు. భార్యా భర్తల మధ్య మనస్పర్థల కారణంగా కొద్ది నెలలుగా ప్రవీణ్ మద్యానికి బానిసయ్యాడు. శనివారం కూడా మద్యం సేవించడంతో వివాదం చోటు చేసుకుంది. దీంతో శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన ప్రవీణ్ అర్ధరాత్రి సమయంలో తనతో తెచ్చుకున్న టవల్‌లో విశాఖ డెయిరీ భెల్ సిగ్నల్ పాయింట్ మధ్యలో సర్వీసు రోడ్డు పక్కన ఉన్న ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ప్రభ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు.

కన్నబాబుకు సత్కారం



కురసాల కన్నబాబుతో గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబును ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఇతర ముఖ్య నాయకులు ఉన్నారు.



కన్నబాబుకు బొకే అందజేస్తున్న 87వ వార్డు నాయకులు

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబును ఆదివారం 87వార్డుకు చెందిన పార్టీ నేతలు బొడ్డగోవింద్ తదితరులు కలిసి సత్కరించారు.

కేంద్ర మంత్రి దృష్టికి భెల్ ఉద్యోగుల సమస్యలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ నాయకులు ఆదివారం నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మను కలిశారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పీఎఫ్ , ఉద్యోగుల సర్వీసు 1992కు బదులు 1997గా నమోదైందని, అలాగే కొంత మంది కార్మికులకు 2011 సంవత్సరంగా నమోదైందని.. వాటిని సవరించాలని మంత్రిని కోరారు. ఇలాంటి దొర్లడంతో పలువురు కార్మిక, ఉద్యోగులు భవిష్యత్తులో చాలా నష్టపోయే పరిస్థితి ఎదురవుతుందని మంత్రికి వివరించారు. ఈ సమస్యపై భెల్ యాజమాన్యంతో పాటు, పీఎఫ్ యాజమాన్యంతో పలు దఫాలుగా చర్చలు జరిపినా సమస్య పరిష్కారం కాలేదని విన్నవించారు.



కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మను సన్మానిస్తున్న భెల్ గుర్తింపు యూనియన్ నాయకులు

95 హయ్యర్ పెన్షన్ అందరికీ రిజక్ట్ అయిందని, దీనిపై సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. గుర్తింపు యూనియన్ నాయకులు బొండా బాబూరావు, సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, పి.భాస్కరరావు, బి.రవీంద్ర,ఎ. వెంకట్రావు పాల్గొన్నారు.